విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలనే ఆశతో యువత అప్పులు చేసి, కుటుంబ ఆస్తులు తాకట్టు పెట్టి డబ్బులు చెల్లించడం ఆందోళనకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధితుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ వారి పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. అయితే, ఈ ఆరోపణలపై ప్రభుత్వం లేదా టామ్‌కామ్ సంస్థ అధికారికంగా స్పందించిన వివరాలు అందుబాటులో ఉన్న సమాచారంలో లేవు. ఆరోపణలపై అధికారిక విచారణ జరిగితేనే వసూళ్లు, ఉద్యోగ నియామకాల పరిస్థితి, బాధ్యత వహించాల్సిన వ్యక్తుల వివరాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అసలేంటి టామ్‌కామ్?

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) విదేశాల్లో ఉద్యోగాలు కోరుకునే రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పించేందుకు పనిచేసే సంస్థ. విదేశీ ఉద్యోగాల నియామక ప్రక్రియలో మధ్యవర్తుల మోసాలను తగ్గించడం, అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం అందించడం దీని ప్రధాన ఉద్దేశం. అధికారిక ప్రక్రియ ద్వారా అభ్యర్థుల వివరాలను నమోదు చేసుకుని, వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా విదేశీ ఉద్యోగావకాశాల గురించి సమాచారం అందించడం, నియామక ప్రక్రియలో సహకరించడం వంటి సేవలను ఈ సంస్థ అందిస్తుంది. అయితే, ప్రతి ఉద్యోగానికి సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, ఫీజులు, నియామక గడువులు వేర్వేరుగా ఉండవచ్చు. అభ్యర్థులు అధికారిక ప్రకటనలను పరిశీలించి, చెల్లింపులకు సంబంధించిన రసీదులు, ఒప్పందాలు భద్రపరచుకోవడం ముఖ్యం.

టామ్‌కామ్ ద్వారా ఏయే దేశాల్లో ఉద్యోగావకాశాలు?

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఒమన్, బహ్రెయిన్, ఖతర్, కువైట్ వంటి గల్ఫ్ దేశాలతో పాటు జర్మనీ, జపాన్, పోర్చుగల్, ఇజ్రాయెల్ తదితర దేశాల్లోనూ నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా టామ్‌కామ్ పనిచేస్తోంది. ఆయా దేశాల్లోని సంస్థలు అవసరమైన ఉద్యోగుల నియామకం కోసం టామ్‌కామ్‌ను సంప్రదించే అవకాశం ఉంది. విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువత నియామక సంస్థ విశ్వసనీయతను, ఉద్యోగ ఒప్పందంలోని నిబంధనలను, వీసా వివరాలను, వసూలు చేసే మొత్తానికి సంబంధించిన అధికారిక ఆధారాలను తప్పనిసరిగా పరిశీలించాలి. ముఖ్యంగా ప్రభుత్వ సంస్థ పేరు మీద డబ్బులు చెల్లించే ముందు సంబంధిత అధికారిక వెబ్‌సైట్ లేదా కార్యాలయం ద్వారా వివరాలను నిర్ధారించుకోవాలి. మొత్తంగా, టామ్‌కామ్ ద్వారా జర్మనీ ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించిన యువతకు న్యాయం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించడం, బాధితుల సమస్యలను పరిష్కరించడం ఇప్పుడు కీలకంగా మారింది.

ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు



ఎల్‌నినో తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇటీవల కాలంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయాల్లోని భూగర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. సాధారణంగా వేసవిలో తలెత్తే నీటి సమస్య ఇప్పుడే ముంచుకొస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్న పరిమితమైన నీటి వనరులను అవసరం మేరకు మాత్రమే వాడుకుని, నీటి వృథాను అరికట్టడం ద్వారా మాత్రమే ఈ గడ్డు పరిస్థితి నుంచి బయట పడగలం. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటిని ఇతర అవసరాలకు వాడొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

ఇతర పనులకు శుద్ధిచేసిన మురుగు జలాలు

తాగునీటేతర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరం సహా ఇతర ప్రధాన నగరాల్లో అత్యాధునిక విధానాలతో మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. వాహనాలు, ఇంటి పరిసరాల శుభ్రత, గార్డెనింగ్ తదితర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను ఉపయోగించాలి.

ఇలా చేయకండి!

ాంతమంది కార్లు, బైక్?లు శుభ్రం చేసేందుకు కుళాయి నుంచి వచ్చే పైపులను వాడుతుంటారు. దీనివల్ల అధికంగా నీరు వృథా అవుతుంది. అందువల్ల తడివస్త్రంతో కారు శుభ్రం చేసుకోవడం మంచిది. బకెట్‌లో నీటిని వినియోగించి తడిగుడ్డతో శుభ్రంచేస్తే 20 లీటర్లు, అంతకంటే తక్కువ నీటితోనే సరిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. వాహనాలను పైపుతో కడగటం కారణంగా వాటి మూలల్లో నీరు నిలిచిపోయి తుప్పుపట్టే అవకాశం ఉంది. ఫలితంగా వాటి జీవితకాలం కూడా తగ్గిపోతుంది. నేరుగా నీటితో శుభ్రం చేయాల్సివస్తే ప్రెషర్ (పవర్) వాషర్ లేదా వాటర్ స్ప్రే ఉన్న హోస్ పైపును వాడాలి.

షవర్ స్నానాలు వద్దు

షవర్‌తో స్నానం చేయడం వల్ల కూడా అధికంగా నీరు వృథా అవుతుంది. అందువల్ల బక్?టే?నే ఉపయోగించి స్నానం చేయడం మంచిది. షవర్‌తో స్నానం చేస్తే 100 లీటర్ల నీరు వృథా అవుతుంది.అదే బకెట్ అయితే కొంచెం నీరు సరిపోతాయి.

స్నానం చేసేందుకు టబ్‌లు వాడటం వల్ల కూడా అధికంగా నీరు వినియోగం అవుతాయి. దీనివల్ల నీరు ఎక్కువగా వృథా అవుతాయి.

నడకబాటలు, ఇంటి ఆవరణను శుభ్రం చేసేందుకు పైపులతో నీళ్లు కొట్టడం కంటే, మగ్?లు వాడి చిలకరించడం మంచిది. కుళాయి నీరు పట్టేటప్పుడు ఇంట్లోని బిందులు, పాత్రల్లో ఉన్న పాత నీరును వృథాగా పారవేయొద్దు. వాటిని మొక్కలకు పోయడం లేదా తాగునీటేతర అవసరాలకు వాడుకోవడం మంచిది. షేవింగ్ చేసుకునేటప్పుడు, బ్రష్, చేతులు శుభ్రపరుచుకునేందుకు ట్యాప్?ను తెరిచి అలానే వదిలేయకుండా మగ్?ను వినియోగించండి. తద్వారా వృథాను ఆపండి.

నీటి వృథా వద్దు

కూరగాయలు, పళ్లు కుళాయి కింద శుభ్రం చేయడం కంటే గిన్నెలో నీరు పోసి కడగండి. మొక్కలకు ఉదయం పూట లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే నీటిని పెట్టడం ఉత్తమం. ఎక్కువ విస్తీర్ణంలో ఉండే మొక్కలకు మల్చింగ్ చేసినట్లయితే తక్కువ నీటి వినియోగం ఉంటుంది. వాషింగ్ మెషిన్లతో దుస్తులు ఉతకడం మేలు. వీటిని ఉపయోగించడం వల్ల నీరు వృథా కాదు. డిష్ వాషర్లు తక్కువ నీటిని వినియోగించుకుంటాయి. చేతితో శుభ్రంచేసినట్లయితే 90 లీటర్లకుపైగా నీరు వినియోగం అయితే, డిష్‌వాషర్ 11 లీటర్ల నీటితో శుభ్రం చేస్తుంది. కొన్నిసార్లు కుళాయిలు, ఫ్లష్ ట్యాంకుల్లో లీకేజీ అవుతుంటాయి. లీకయ్యే కుళాయి ద్వారా రోజుకు సుమారు 100 లీటర్ల వరకు నీరు వృథా అవుతుంది.

మన తొలివెలుగు

అమెరికా చలిమంటలకు ఏ చమురు అనర్హం!

అవకాశవాదం... అమెరికా.. ఈ రెండిటినీ విడదీసి చూడటం అసాధ్యం. ప్రపంచానికి ఎన్ని ఆదర్శాలను అమెరికా చెప్పిందో అంతకుమించి అవకాశవాదాలనూ ప్రదర్శించింది. స్వేచ్ఛా జీవితాన్ని గడపటానికీ, ఆనందాన్ని అనుభవించటానికీ పుట్టుకతోనే మనిషికి కొన్ని హక్కులు ఉంటాయని చాలా గొప్పగా తన స్వాతంత్ర్య ప్రకటనలో చెప్పిన అమెరికా దాన్ని ఏనాడూ పాటించలేదు. ఆఫ్రికా నుంచి కొనుగోలు చేసి అమెరికాకు తెచ్చిన లక్షలాది నల్లజాతీయులకు ఆ హక్కులను ఇవ్వాలన్న ఆలోచన రాలేదు. బానిసత్వాన్ని సహజసిద్ధమైన వ్యవస్థగా ఆమోదించి దశాబ్దాలపాటు దాన్ని అమలుచేసింది. 1965 వరకూ నల్లజాతీయులకు సమానహక్కులను ఇవ్వలేదు. అట్లాంటిక్ తీరం నుంచి పసిఫిక్ తీరం వరకూ దేశాధికారాన్ని విస్తరించే క్రమంలో వందలాది ఆదిమ తెగలను హరించివేసింది. ప్రజాస్వామ్య రాజకీయాలనూ, వ్యక్తి స్వేచ్ఛనూ, ప్రైవేటు వ్యాపారాలనూ ప్రపంచమంతా విస్తరించటమే తన లక్ష్యాలని చెబుతూ అనేక దేశాల్లో నియంతృత్వ ప్రభుత్వాలకు వెన్నుదన్నుగా నిలిచింది. మత, ఛాందసవాద సమూహాలను ప్రోత్సహించింది. ప్రపంచ ప్రయోజనాల పేరుతో నిన్నటి దాకా తప్పు.. తప్పు.. అని చెప్పి.. ఒక్కరోజులోనే దాన్ని ఒప్పు.. ఒప్పు అనగలిగిన అవకాశవాద నేర్పరితనం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఘనంగా చేసిన ప్రకటనే ఇందుకు నిదర్శనం. నాలుగేళ్లకు పైగా సాగుతోన్న రష్యా--ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచమే అట్టుడికిపోతోంది. రష్యాది దురాక్రమణగా భావించిన అమెరికా ఎన్ని ఆంక్షలు విధించాలో అన్నీ విధించింది. ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలను అదిరించి బెదిరించి లొంగదీసుకుంది. భారత్ కూడా ఒకదశలో రష్యా నుంచి కొనుగోళ్లను దాదాపుగా ఆపివేసింది. రష్యాతో లావాదేవీలను నడిపే దేశాలపై దిగుమతి సుంకాలనూ అమెరికా పెద్దఎత్తున విధించింది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే పేరుతో విదేశాల్లో ఉన్న రష్యా ఆస్తులనూ స్తంభింపచేసింది. ఇంతటి శత్రుపూరిత వైఖరిని అతి తేలికగా మార్చుకుని అవకాశవాదంలో తనకు సాటిలేదనే విషయాన్ని అమెరికా మరోమారు స్పష్టంచేసింది. ఇలాంటి అవకాశవాదాన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా నిర్వాకాలపై గతంలో లోతైన విశ్లేషణలూ, కవిత్వాలూ చాలానే వచ్చాయి. 1961లో మహాకవి శ్రీశ్రీ కూడా ఆనాటి అమెరికా అధ్యక్షుడు కెన్నడీని ఉద్దేశిస్తూ కవిత రాశారు. 'అరువులిచ్చి కరువు తెచ్చి.. రుణంపెట్టి రణం తెచ్చి.. జనంధనం ఇంధనమై.. చరణ కరాబంధనమై.. జనన జరా మరణ దురాక్రమణల సంగ్రంథనమై.. ఒకనాడోహో అనిపించుక తిరిగిన.. ధనికవాద మికపై వెగటై జిగటై..' అంటూ ఆనాడు శ్రీశ్రీ రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇప్పటికీ బాగా సరిపోతాయి. ట్రంప్ హయాంలో అమెరికా ధనికవాదం వెగటై.. జిగటై గతంలో ఎన్నడూ లేనంతగా అసహ్యం పుట్టిస్తోంది. ఒకప్పటి అమెరికా అధ్యక్షులైన అబ్రహం లింకన్, జాన్.ఎఫ్.కెన్నడీ లాంటి వారు వ్యక్తంచేసిన ఆదర్శ అభిప్రాయాలకు ప్రభావితమైన ప్రజాస్వామ్య ప్రియులు చాలామందే ఉండేవారు. ట్రంప్ లాంటి వాళ్లకు అట్లాంటివేవీ లేవు కనుక ప్రతి విధానమూ, ప్రతి ప్రకటనా ఇప్పుడు వెగటుగానే అనిపిస్తోంది. అన్నింట్లోనూ అమెరికా ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామనీ, అందుకు అడ్డుగా ఉన్న అంతర్జాతీయ చట్టాలనూ, సంస్థలనూ, ఒప్పందాలనూ కాలరాస్తామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే చెబుతుంటే నాగరీక మనుషులు సహించలేరు. వేల సంవత్సరాల సంస్కృతులు కలిగి, సుదీర్ఘ చరిత్రలో మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదం చేసిన చైనా, భారత్ లాంటి దేశాల్లో గతం గురించి సమగ్ర అవగాహన పెరుగుతున్న కొద్దీ అమెరికాపై అసహనం ఎక్కువవుతుందే తప్ప తగ్గదు. అమెరికా మద్దతు లేకపోతే రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ఇంతకాలం కొనసాగి ఉండేది కాదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రజాస్వామ్యవాది కాదు. ఆ దేశంలో ప్రజాస్వామ్య రాజకీయాలూ లేవు. నియంతల మనుగడకూ కొన్ని అంశాలు.. ముఖ్యంగా జాతి ప్రయోజనం, గౌరవం, భద్రత పేరుతో కూడినవి.. చాలా బాగా ఉపయోగపడతాయి. అమెరికా సారథ్యంలోని నాటో కూటమి స్వార్థం, అహంకారంతో వేసిన తప్పటడుగులు రష్యాను ఉక్రెయిన్ మీదకు ఉసిగొల్పేలా చేయగలిగాయి. జర్మనీ ఏకీకరణ (1990) సందర్భంగా నాటో విస్తరణ ఒక్క అంగుళం కూడా అదనంగా ఉండదని ఆనాటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడైన మిఖాయిల్ గోర్బచెవ్‌కు అమెరికా హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకే జర్మనీ ఏకీకరణ సాఫీగా సాగటానికి సోవియట్ యూనియన్ సహకరించింది. ఆ తర్వాత కొద్దికాలానికే సోవియట్ యూనియన్ (1991 డిసెంబర్ 26) పతనమైంది. రష్యా సహా 15 దేశాలు విడివిడిగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో 9 దేశాలు క్రమంగా నాటోలో చేరిపోయాయి. ఒక్క అంగుళం హామీ అలా గాల్లో కలిసిపోయింది. రష్యాలో 2000 సంవత్సరం వరకూ ఆర్థికంగా అల్లకల్లోల పరిస్థితులే ఉన్నాయి. వీటికీ ఒక రకంగా అమెరికాయే కారణం. దశాబ్దాల పాటు కొనసాగిన ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థను ఒక్కపెట్టున ప్రైవేటుపరం చేయటంతో పరిస్థితులు గాడితప్పాయి. ప్రభుత్వ సంస్థలనూ, కంపెనీలనూ కారుచౌకగా ప్రైవేటు రంగానికి కట్టబెట్టారు. అన్నిటినీ మార్కెట్‌కే వదలివేయటంతో ధరలూ, నిరుద్యోగమూ విజృంభించాయి. బ్లాక్‌మార్కెట్ సర్వసాధారణమైంది. విద్య, వైద్యరంగం, ప్రాథమిక సౌకర్యాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవటంతో జీవన ప్రమాణాలు క్షీణించాయి. ప్రైవేటురంగంతో పోటీ పెరిగి రష్యా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్న జోస్యాలు ఏ రకంగానూ నిజంకాలేదు. ఒకరకంగా అరాచకమే ప్రబలిపోయింది. అట్లా అమెరికా ప్రభుత్వమూ, ఆ దేశ మేధావులూ సూచించిన విధానాలు అస్తవ్యస్త పరిస్థితులకే దారితీశాయి. పుతిన్ అధికారాన్ని చేజిక్కించుకోటానికి అవే కారణమయ్యాయి. ఆ నేపథ్యంలోనే రష్యాకు మళ్లీ ఒకనాటి వైభవాన్ని తీసుకువస్తానన్న పుతిన్ వాగ్దానాలు ప్రజలపై ప్రభావాన్ని కలగచేశాయి. ఒక భాష, ఒక మతం, ఒక జాతి (జ్ఞ్ష్ట్రఅఱఽ జశీఎఐబఅఱ్ఱఎ) దేశ అస్తిత్వానికి పునాదిగా ఉన్నచోట భావోద్వేగాలను రెచ్చగొట్టటం తేలిక. రష్యాకు చుట్టూ ప్రమాదం ముంచుకొస్తోందన్న పుతిన్ ప్రచారానికి ఆ ఉద్వేగాలు తోడ్పడ్డాయి. ఉక్రెయిన్, జార్జియాలు కూడా భవిష్యత్తులో నాటోలో చేరతాయన్న ప్రకటనతో (2008) రష్యాలో భయాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక అక్కడి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా బాగా దృష్టి పెట్టింది. రష్యాకు అనుకూలంగా ఉండే ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యానుకోవిట్ అధికారాన్ని కోల్పోవటంలో అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల పాత్ర చాలా ఉంది. మైదాన్ విప్లవం పేరుతో ఉక్రెయిన్‌లో జరిగిన రాజకీయ పరిణామాలకు అమెరికా పూర్తిగా సహకరించింది. ఆ వెంటనే క్రిమియాను రష్యా ఆక్రమించింది. ఉక్రెయిన్‌లోని రష్యా సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుబాట్లను పోత్సహించింది. చివరికి 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై ప్రత్యక్ష యుద్ధానికి దిగింది. ఉక్రెయిన్‌కు యుద్ధ సహాయం కింద అమెరికా ఈ ఏడాది మార్చివరకూ రూ.12 లక్షల కోట్లను ఖర్చుపెట్టింది. మొత్తంగా రూ.17 లక్షల కోట్లు వ్యయం అవుతాయని లెక్కలుకట్టింది. ఇవిగాక ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రూ.1.90 లక్షల కోట్లను రుణంగా ఇప్పించింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరో రూ.22 లక్షల కోట్లను ఉక్రెయిన్ యుద్ధానికి ఖర్చు చేస్తోంది. అంటే అమెరికా, ఈయూ కలిసి దాదాపు రూ.40 లక్షల కోట్లను వెచ్చిస్తున్నాయి. ఉక్రెయిన్ తటస్థ దేశంగా ఉంటుందనీ, నాటో కూటమిలో చేర్చుకునేది లేదనీ స్పష్టంచేయకుండా, నాలుగున్నర ఏళ్ల నుంచీ దౌత్యపరమైన చొరవను ప్రదర్శించకుండా, లక్షల మరణాలకూ, భౌతిక ఆస్తుల విధ్వంసానికి అమెరికాయే ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష కారణమైంది. ఇంతగా కకావికలు చేసి మధ్యంతర ఎన్నికల్లో గెలవటానికి రష్యా చమురు కొనుగోలునే అస్త్రంగా చేసుకుని రాజకీయంగా దిగజారిపోతున్న ప్రతిష్ఠను కాపాడుకోటానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అవసరమైతే మళ్లీ రష్యా చమురు అమ్మకాలపై నిషేధాన్ని విధించొచ్చు. యుద్ధం వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణనష్టం లక్షల్లో ఉంది. అనధికార అంచనాల ప్రకారమే ఇరు దేశాలకు చెందిన 6 లక్షల మంది సైనికులు మరణించారు. ఇందులో రష్యను సైనికులే నాలుగున్నర లక్షల దాకా ఉండొచ్చు.

ఇకనైనా ఇథనాల్, కోకాకోలా, డేటా సెంటర్లకు నీళ్లు ఆపండి!



రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయాన్ని ఎల్‌నినో తీవ్రంగా దెబ్బతీసింది. వర్షాభావం, అడుగంటిపోతున్న భూగర్భ జలాలు, ఖాళీ అవుతున్న రిజర్వాయర్లు రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే పెసర, మినుము, సోయాబీన్ వంటి పంటలు కోతకు వస్తుండగా, మిగిలిన పంటలు నీరందక ఎండిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బావులు, బోర్లు ఎండిపోవడంతో పాటు విద్యుత్ కోతలు సర్వసాధారణమయ్యాయి. యూనిట్‌కు పది రూపాయలు చెల్లించి కొందామన్నా మార్కెట్‌లో విద్యుత్ లభించని పరిస్థితి ఉందని ప్రభుత్వమే ప్రకటించడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్ర వ్యవసాయానికి ఆధారమైన నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం తీవ్రంగా పడిపోయింది. ఈ రుతుపవనాల సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు కాగా, గత సంవత్సరం జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు 988.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కానీ ఈ ఏడాది అదే కాలంలో 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 జిల్లాలు మాత్రమే సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయగా, ఏకంగా 17 జిల్లాల్లో 20శాతం నుంచి 59 శాతం వరకు లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో 848.77 టీఎంసీల నీరు ఉండగా, ఈ ఏడాది అది 475.57 టీఎంసీలకు పడిపోయింది.

ఉపరితల నీటి లభ్యత తగ్గడంతో రైతులు బోర్లపై విపరీతంగా ఆధారపడ్డారు. దీనికి తోడు నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, పత్తి పంటలను విస్తృతంగా సాగు చేయడంతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటు భూగర్భ జలమట్టం గత ఏడాది ఆగస్టులో 5.78 మీటర్లు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు నాటికి 7.87 మీటర్లకు పడిపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా, ఈసారి 1,25,85,426 ఎకరాలకు పరిమితమైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 65,95,645 ఎకరాలు కాగా, గతేడాది ఖరీఫ్‌లో 67,33,484 ఎకరాల్లో సాగై, ఈసారి 56,79,969 ఎకరాలకు అంటే దాదాపు 9 లక్షల ఎకరాలకు పైగా తగ్గింది. ధాన్యాల మొత్తం సాగు విస్తీర్ణం 72,48,771 ఎకరాలకు గాను 63,12,526 ఎకరాల్లో (87శాతం) మాత్రమే సాగైంది. నూనెగింజల సాగు 4,47,585 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను 3,96,597 ఎకరాలకు పరిమితమైంది.

రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో వరి వంటి నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలను సాగు చేయడం తీవ్ర ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి లభ్యతను బట్టి డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా తక్కువ నీటితో పండే జొన్న, సజ్జ, రాగి వంటి చిరుధాన్యాలు, శనగ, పెసర వంటి పప్పుధాన్యాలు, ఆముదం, వేరుశనగ వంటి నూనెగింజల ఆరుతడి పంటలను మాత్రమే వేయాలి. మరోవైపు ప్రభుత్వం శాస్త్రీయ అవగాహన లేకుండా ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఒక ఆయిల్ పామ్ చెట్టుకు రోజుకు 250 నుంచి 300 లీటర్ల నీరు, ఏటా 1500 నుంచి 1800 మి.మీ వర్షపాతం అవసరం. కరువు సమయంలో కొత్తగా ఆయిల్ పామ్ నాటితే 90శాతానికి పైగా లేత మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి, కేంద్రానికి నివేదికలు పంపి ఎన్‌డీఆర్ఎఫ్ నిధులతో పాటు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలి. ఇతర మౌలిక వసతుల కాంట్రాక్టర్లకు ఇచ్చే నిధులను కరువు పీడిత గ్రామాలకు మళ్లించాలి. రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని వెంటనే అమలులోకి తేవాలి. ఖరీఫ్‌లో సగటు దిగుబడులు పడిపోయిన రైతులందరికీ బీమా పథకం కింద నష్ట పరిహారం అందించాలి. గత ఆరు సీజన్లుగా పంటల బీమా పథకం లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి వీలుగా కౌలు రైతులను కూడా ప్రభుత్వం తక్షణమే గుర్తించాలి. ఈ సీజన్‌లో పంటల సగటు దిగుబడులు బాగా తగ్గిన రైతులతో పాటు కూరగాయల రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. కౌలు రైతులతో సహా, పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి. వరి, పత్తి లాంటి ప్రధాన పంటలకు 2026లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నిర్ణయించిన రుణ పరిమితిలో 50శాతం వరకూ రైతులకు పరిహారంగా అందించాలి. కౌలు రైతుల గుర్తింపు కోసం 2011 అధీకృత సాగుదారుల చట్టాన్ని అమలు చేయాలి. వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా రైతులను గుర్తించడానికి మహారాష్ట్ర తరహాలో ప్రత్యేక చట్టాన్ని తేవాలి. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. యాసంగికి ఆరుతడి విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలి. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడడంతో పాటు పశువుల మేతను సరఫరా చేయాలి. వలసలను నివారించడానికి ఉపాధి హామీ పనులను తక్షణమే విస్తృతంగా ప్రారంభించాలి. ఎక్కువ మందికి పనులు కల్పించడానికి వీలుగా చిన్న, సన్నకారు రైతులకు, గ్రామీణ మౌలిక వసతులైన గిద్దంగులు, డ్రయ్యింగ్ యార్డులు, స్కూల్ భవనాలు, లాంటి మౌలిక వసతుల మేలు జరిగేలా ఈ సీజన్‌లో ఉన్న ప్రత్యేక పరిస్థితి దృష్ట్యా కొత్త పనులను ఉపాధి హామీ పథకానికి జోడించాలి. రైతుల, స్వయం సహాయక బృందాల బ్యాంకు అప్పుల వాయిదాలను ప్రభుత్వం ఒక ఏడాది పాటు వాయిదా వేసి, వడ్డీలను మాఫీ చేయాలి. ఇప్పటికీ మిషన్ భగీరథ పథకం గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. చాలా చోట్ల ఈ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందడం లేదు. మిషన్ భగీరథ పూర్తి స్థాయి మంచి నీటి పథకం. ఈ పథకం అమలులోని సమస్యలను పరిష్కరించడానికి, తగిన స్థాయిలో తాగునీటిని ప్రజలకు సరఫరా చేయడానికి ప్రభుత్వం పూనుకోకపోవడం వల్ల, ప్రజలు ఎంతో డబ్బు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆయా కుటుంబాలపై పెద్ద ఆర్థిక భారాన్ని మోపుతున్నది. అన్నింటికంటే ముఖ్యంగా, ప్రాజెక్టులలో నీటి కొరత ఉన్నందున మిషన్ భగీరథ నీటిని ఇథనాల్, కోకాకోలా, డేటా సెంటర్లు వంటి పరిశ్రమలకు మళ్లించకుండా, కేవలం ప్రజల తాగునీటికి, ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించాలి

కక్షసాధింపులో 'బతుకమ్మ' బలి!



తెలంగాణ ఉద్యమంలో అస్తిత్వ పతాకగా నిలిచిన బతుకమ్మపై ఉద్యమ ద్వేషులైన కాంగ్రెస్ పాలకులు వారి సహజ రీతిలోనే వివక్ష చూపిస్తున్నారు. ఈ పండుగకు సిరిసిల్ల నేతన్నలకు కనీసం చీరల ఆర్డర్లు కూడా సరిగా ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆకలికేకలతో అల్లాడుతున్నాయి. కనిపించిన దేవుళ్ల పేర్లన్నీ వాడుకొని రాజకీయం చేసే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ఆడబిడ్డల ఘనమైన పండుగ బతుకమ్మకు సరైన ఏర్పాట్లు చేయడం చేతకావడం లేదా? లేదం టే, బతుకమ్మ ఆటపాటల్లో కూడా వినాయకచవితి పండుగలాగే ఊరూరా కేసీఆర్ గానమే వినిపిస్తుందనే భయమా? అని ప్రజల్లో చర్చ జరుగుతున్నది. స్వరాష్ట్ర కల సాకారమైన ఆత్మగౌరవ ప్రతీక. పరాయి పాలకుల గడ్డపై, ఆంధ్రా వలస పాలనలో అణచివేతకు గురైనా మన అస్తిత్వాన్ని చాటుకోవడానికి, ఉద్యమకాలంలో ఇదే బతుకమ్మ తెలంగాణ అస్తిత్వ పతాకమై నిలిచింది. ఆనాడు ఉద్యమంలో వీధివీధినా పూల సింగిడిలై కదిలిన ఆడబిడ్డలు, స్వయంపాలన కాంక్షను ఈ పండుగ ద్వారానే చాటారు. కేసీఆర్ నాయకత్వంలోని గులాబీ సైన్యం ఈ పండుగకు బ్రాండ్ అంబాసిడర్‌గా ముందుండి నిలిచింది. తెలంగాణ సంస్కృతి, బతుకమ్మ విశిష్టతను గల్లీ నుంచి ఢిల్లీ దాటించి లండన్, అమెరికా మీదుగా దుబాయ్ బుర్జు ఖలీఫా స్క్రీన్ల వరకు చేర్చి, అంతర్జాతీయ స్థాయిలో బతుకమ్మకు ఒక సగర్వమైన గుర్తింపును తెచ్చింది బీఆర్ఎస్ శ్రేణులే. స్వరాష్ట్రంలో అధికారం మార్పిడి జరిగి, కాంగ్రెస్ పాలకులు గద్దెనెక్కిన తర్వాత నుంచి కనిపిస్తున్న దృశ్యాలు ప్రతీ తెలంగాణవాసి గుండెను రగిలిస్తున్నాయి. అధికార పార్టీకి తెలంగాణ సంస్కృతి అన్నా, ఇక్కడి సంప్రదాయాలన్నా ఎంతటి చులకన భావమున్నదో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరి చూస్తే స్పష్టమవుతున్నది. బతుకమ్మ పండుగను తాము ఎంత ఘనంగా నిర్వహించినా, అది తెలంగాణ వాదానికి, బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు లబ్ధి చేకూరుస్తుందనే అక్కసుతో, తీవ్రమైన రాజకీయ ద్వేషంతోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కోటి మందికిపైగా ఆడబిడ్డల ఇంటికి 'బతుకమ్మ కానుక'గా రేషన్ షాపుల ద్వారా వారం రోజుల ముందే చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టి, పూర్తి చేసేవారు. వందలాది రంగులు, అద్భుతమైన డిజైన్లతో ఒక కుటుంబంలో అన్నగా, తమ్ముడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ పంపే ఆ చీరల కోసం మహిళలు ఎంతగానో ఎదురుచూసేవారు. కానీ నేడు, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో బతుకమ్మ కానుకలపై కక్షసాధింపు చర్యలు మొదలయ్యాయి. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని బజారుకీడుస్తూ, చీరల పంపిణీని నిలిపివేసి, బతుకమ్మపై తమకున్న వివక్షను బట్టబయలు చేసుకున్నారు. నాడు బతుకమ్మ చీరల ఆర్డర్ల వల్ల సిరిసిల్ల పవర్‌లూమ్ రంగానికి, పోచంపల్లి చేనేత కార్మికులకు రూ.350 కోట్లకు పైగా బడ్జెట్‌తో నిరంతరాయంగా ఉపాధి లభించేది. ఆ మగ్గాల చప్పుడు నేతన్నల ఇండ్లల్లో సంక్రాంతి సంబురాన్ని నింపేది. కానీ నేడు కాంగ్రెస్ సర్కార్ నేతన్నలకు పాత బకాయిలు చెల్లించకుండా, కొత్త ఆర్డర్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నది. సిరిసిల్ల నేతన్నలను బతుకమ్మ చీరల నెపంతో రోడ్డున పడేసి, సూరత్ కంపెనీలకు మేలు చేసేలా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం వెనుక ఉన్న కుట్రలేమిటో ప్రజలంతా గమనిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధులను నేరుగా జిల్లాలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించేవారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన చెరువులు, రాష్ట్రంలోనే వేలాది నిమజ్జన ప్రాంతాలన్నీ విద్యుత్తు వెలుగులతో, అద్భుతమైన మౌలిక వసతులతో, క్యూలైన్లతో వైభవంగా వెలిగిపోయేవి. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధులను నేరుగా జిల్లాలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించేవారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన చెరువులు, రాష్ట్రంలోనే వేలాది నిమజ్జన ప్రాంతాలన్నీ విద్యుత్తు వెలుగులతో, అద్భుతమైన మౌలిక వసతులతో, క్యూలైన్లతో వైభవంగా వెలిగిపోయేవి. కానీ నేడు ఆ చెరువుల్లో కనీసం గుర్రపుడెక్కను తీయడానికి, వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా స్థానిక సంస్థల వద్ద నిధులు లేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అనవసరమైన పనులకు వేల కోట్లాది రూపాయలను కేటాయిస్తున్న కాంగ్రెస్ సర్కార్, బతుకమ్మ పండుగ నిర్వహణకు బడ్జెట్ విడుదల చేయకుండా చేతులెత్తేసి, తెలంగాణ పరువు తీసింది. ఢిల్లీ పాలకుల కనుసన్నల్లో నడిచే కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ మట్టి వాసన, ఇక్కడి అస్తిత్వ పండుగల విలువ తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ, కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షను తెలంగాణ పౌరుల ఆత్మగౌరవమైన బతుకమ్మ పండుగపై చూపించడం అత్యంత దుర్మార్గం. ఈ వివక్షను తెలంగాణ సమాజం అంతా గమనిస్తున్నది. మన సంస్కృతిని గౌరవించని రాష్ట్ర పాలకులకు, మన పండుగలను అవమానించే ఈ శక్తులకు ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఆడబిడ్డ, ప్రతి నేతన్న రాబోయే రోజుల్లో తమ ఓ టుహక్కు రూపంలో బుద్ధి చెప్పడం ఖాయం.

కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో 30, 31వ వార్డు కౌన్సిలర్లు ఎం.డి. లయిక్ అహ్మద్, సుమయ్య తబస్సుమ్ షఫీక్ అహ్మద్




మన తొలి వెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి । జంగిటి రవీందర్ । అక్టోబర్ 18, 2026 : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి పట్టణంలోని 30, 31వ వార్డుల కౌన్సిలర్లు ఎం.డి. లయిక్ అహ్మద్, సుమయ్య తబస్సుమ్ షఫీక్ అహ్మద్ కోరారు. భువనగిరి పట్టణంలోని రేషన్ షాపు నంబర్ 16లో ఆదివారం 30, 31వ వార్డులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరూ పొందాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఈ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డు రాష్ట్రంలో గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని, అందులోని క్యూ ఆర్ కోడ్ ద్వారా కార్డుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చని వివరించారు. గత ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ చేపట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది మందికి రేషన్ కార్డులు అందించిందని వారు పేర్కొన్నారు. అలాగే ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతూ, భవిష్యత్తులో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎం.డి. షఫీ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి. మన్సూర్, ఎం.డి. జబ్బార్, సంతోష్ నాయక్, తాజీర్ పాషా, కబీర్, రేషన్ షాపు డీలర్ శేఖర్, అఫ్సర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆయుధ, వాహన పూజలు

ఆయుధాలు, వాహనాలను జాగ్రత్తగా వినియోగిస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా విధులు నిర్వహించాలి

జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్



మన తొలి వెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి । జంగిటి రవీందర్ । అక్టోబర్ 18, 2026 : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరిలోని డీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ, వాహన పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ పాల్గొని పోలీస్ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ విధుల్లో ఆయుధాలు, వాహనాలు ఎంతో కీలకమైనవని తెలిపారు. వాటిని ఎల్లప్పుడూ అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా, తగిన జాగ్రత్తలు పాటిస్తూ వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు, ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా నియమాలను పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆనందకరమైన వాతావరణంలో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, శ్రేయస్సును తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్, డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు, సురేష్, సీఐ చంద్రబాబు, ఆర్ఐలు శ్రీనివాస్ నాయుడు, లతీఫ్ ఉద్దీన్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

తాళ్లపల్లి కుమారస్వామి



మన తొలివెలుగు । భీమదేవరపల్లి । కదిరే స్వామి । అక్టోబర్ 18, 2026 : దసరా పండుగను పురస్కరించుకొని గాంధీనగర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి ఒకటో వార్డు సభ్యుడు, న్యాయవాది తాళ్లపల్లి కుమారస్వామి బట్టలు అందించి ఘనంగా సన్మానించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. పండుగలు సంతోషాలను పంచుకోవడంతో పాటు సమాజానికి సేవ చేస్తున్న వారిని గుర్తించి గౌరవించే గొప్ప సందర్భాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎండ, వాన అనే తేడా లేకుండా ప్రతిరోజూ తమ విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించేందుకు పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. సమాజంలో ప్రతి వృత్తికీ తగిన గౌరవం ఉండాలని, గ్రామ అభివృద్ధిలో కార్మికుల కృషిని ఎవరూ మరువకూడదని తెలిపారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. దసరా పండుగ సందర్భంగా సిబ్బందికి బట్టలు అందించి సన్మానించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహాన్ని నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పండుగ వేళ సన్మానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నమ్మకమే లక్ష్యంగా.. నాణ్యమైన ఇంధనం అందిస్తాం

మామిడిపల్లిలో మహాకాల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

24 గంటలు ఉచిత గాలి, స్వచ్ఛమైన తాగునీరు.. డిజిటల్ చెల్లింపుల సౌకర్యం



మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి । ముత్తయ్య । అక్టోబర్ 18, 2026 : వినియోగదారుల నమ్మకమే లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన, కల్తీ లేని పెట్రోల్, డీజిల్ అందించనున్నట్లు మహాకాల్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో వివేకానంద విగ్రహం సమీపంలో శంషాబాద్ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన మహాకాల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారవేత్తలు పుంజాల రంజిత్ రావు, శ్రీమంతుల వీరస్వామి గౌడ్, శ్రీమంతుల శ్రీకాంత్ గౌడ్, శ్రీమంతుల మనిషి గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఇంధన కేంద్రాన్ని ముఖ్య అతిథులు ప్రముఖ వ్యాపారవేత్తలు ఎడ్ల కృష్ణారెడ్డి, స్వామి గౌడ్, ఎమ్మెల్యే పద్మారావు కుమారుడు కిరణ్ గౌడ్, నిమ్మల నరేందర్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వాహనదారులకు నాణ్యమైన ఇంధనాన్ని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కచ్చితమైన కొలతలతో పారదర్శకంగా పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తామని వెల్లడించారు. వినియోగదారుల సౌకర్యార్థం 24 గంటల పాటు ఉచిత గాలి, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు యూపీఐ, కార్డుల ద్వారా డిజిటల్ చెల్లింపుల సదుపాయం కల్పించినట్లు తెలిపారు. మామిడిపల్లి, జల్పల్లి గ్రామాల ప్రజలతో పాటు శంషాబాద్ ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఈ ఫిల్లింగ్ స్టేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నాణ్యమైన సేవలతో వినియోగదారుల విశ్వాసాన్ని పొందుతూ మంచి పేరు సంపాదించడమే తమ లక్ష్యమని చెప్పారు. స్థానిక ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వీఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కళ్లెం నరేష్ గౌడ్, మాజీ చైర్మన్ గోపాల్ యాదవ్, జల్పల్లి మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు యాతం పవన్ కుమార్ యాదవ్, సానం శ్రీనివాస్ గౌడ్, సుక్క శివకుమార్, ఈరంకి వేణు గౌడ్, పేరేమోని నరేష్ యాదవ్, లాల్ సతీష్ గౌడ్, ఆదిళ్ళ జంగయ్య, ఈరంకి విశ్వనాథ్ గౌడ్, షేక్ జహంగీర్, ఎండీ నయీమ్, గుర్జని గణేష్ గౌడ్, దూడల ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నవంబర్ 5 వరకు గడువు.. నవంబర్ 14న హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానం



మన తొలివెలుగు భీమదేవరపల్లి ప్రతినిధి । కదిరె స్వామి। అక్టోబర్ 18, 2026 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులను అందించనున్నట్లు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న హైదరాబాద్‌లో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో ఆయన విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి సృజనాత్మకతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఈ అవార్డులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

34 రంగాల్లో ప్రతిభకు గుర్తింపు

దేశభక్తి గీతాలు, భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు, జానపద గీతాలు, గిటార్, కీబోర్డు, ఫ్లూట్, తబలా, యోగా, చిత్రలేఖనం, కార్టూన్లు, కవిత్వం, మిమిక్రీ, మ్యాజిక్, పర్వతారోహణ, సైక్లింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్, కరాటే, చెస్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, రన్నింగ్, టెన్నిస్, ఆర్చరీ, బతుకమ్మ, కోలాటం, జాతీయ సమైక్యత శిబిరాలు తదితర 34 రంగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

విజయాలకు సంబంధించిన ఆధారాలు జతచేయాలి

విద్యార్థులు ఆయా రంగాల్లో సాధించిన విజయాలకు సంబంధించిన మెరిట్ సర్టిఫికెట్లు, పత్రికా కథనాలు, బయోడేటా, ఫొటోలను దరఖాస్తుతో జతచేసి పోస్టు ద్వారా పంపించాలని సూచించారు. సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం అర్హులైన ప్రతిభావంతులను రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

నవంబర్ 5 చివరి గడువు

అర్హులైన విద్యార్థుల నుంచి 2026 నవంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వలస సుభాష్ చంద్రబోస్ వెల్లడించారు. ప్రతిభ కలిగిన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా:

వలస సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర అధ్యక్షుడు, బాలల హక్కుల ప్రజా వేదిక ఇంటి నంబర్: 2-92, కూరెల్ల గ్రామం కోహెడ మండలం, సిద్దిపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం -- 505473.

దసరా వేళ మద్యం సిండికేట్ల దందా!

బెల్ట్ షాపులకు యథేచ్ఛగా సరఫరా?

బాటిల్‌పై రూ.20 నుంచి రూ.100 వరకు అదనపు వసూళ్ల ఆరోపణలు. !

ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణపై ప్రశ్నలు



మన తొలివెలుగు ।భీమదేవరపల్లి ప్రతినిధి । కదిరే స్వామి । అక్టోబర్ 18, 2026 : దసరా పండుగ వేళ ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం విక్రయాలపై అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ ఏ మేరకు ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

296 మద్యం దుకాణాలు.. సిండికేట్ల ఆధిపత్యం?

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 296 మద్యం దుకాణాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో కొన్ని దుకాణాల యజమానులు సమూహాలుగా ఏర్పడి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదు నుంచి పది లేదా అంతకంటే ఎక్కువ దుకాణాలు ఒకే సిండికేట్ తరహాలో వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వ్యవహారాల వల్ల వ్యాపారంలో పోటీ తగ్గి, ధరల విషయంలో వినియోగదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగితేనే వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

బెల్ట్ షాపులకు మద్యం ఎక్కడి నుంచి?

గ్రామాలు, పట్టణాల్లోని కొన్ని బెల్ట్ షాపులకు ఆటోలు, వ్యాన్ల ద్వారా మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణ దుకాణాల్లో అందుబాటులో లేని కొన్ని బ్రాండ్లు బెల్ట్ షాపుల్లో లభిస్తున్నాయనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల కొనుగోళ్లు, నిల్వలు, విక్రయాల రికార్డులను పరిశీలిస్తే సరఫరా మార్గాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏ దుకాణం నుంచి ఎంత మద్యం బయటకు వెళ్తోంది? అది ఎక్కడ విక్రయిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బాటిల్‌పై రూ.100 వరకు అదనపు వసూళ్లు?

కొన్ని ప్రాంతాల్లో బ్రాండ్‌ను బట్టి ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. పండుగ రద్దీని ఆసరాగా చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా అమ్మకాలు జరుగుతున్నాయా? కొనుగోలుదారులకు బిల్లులు ఇస్తున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలి. అధిక ధరల వసూళ్లు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

షాపులు ముందే మూసివేత.. బెల్ట్ షాపుల్లో విక్రయాలా?

కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి ముందే మూసివేస్తున్నప్పటికీ, బెల్ట్ షాపుల్లో మద్యం లభిస్తోందనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో దుకాణాల నిర్వహణ సమయాలు, మద్యం నిల్వలు, రవాణా వివరాలపై తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

మామూళ్ల ఆరోపణలపై విచారణ ఏదీ?

అక్రమ మద్యం విక్రయాలపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. నెలవారీ మామూళ్ల కారణంగా తనిఖీలు బలహీనపడుతున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణ వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ శాఖ స్పందించాలి!

దసరా సందర్భంగా మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, బెల్ట్ షాపులకు అక్రమ సరఫరా జరుగుతోందన్న ఆరోపణలు, అధిక ధరల వసూళ్లు, దుకాణాల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గుట్టలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక

బరిగే శిరీష



మన తొలి వెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి । జంగిటి రవీందర్ । అక్టోబర్ 18, 2026 : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని 6వ వార్డులో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, గౌరమ్మకు పూజలు నిర్వహిస్తూ సంప్రదాయ బతుకమ్మ పాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బరిగే శిరీష మాట్లాడుతూ, తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషకరమన్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సామూహికంగా వేడుకలు నిర్వహించడం తెలంగాణ సంస్కృతి గొప్పతనానికి, మహిళల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె అన్నారు. బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగను విజయవంతం చేసిన యాదగిరిగుట్ట 6వ వార్డు మహిళలకు, ప్రజలకు ఆమె అభినందనలు తెలిపారు. తెలంగాణ పూల పండుగైన బతుకమ్మ వేడుకలు వార్డులో పండుగ వాతావరణాన్ని నింపాయి.

పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల హక్కులకు పాతర!

ఉచిత గాలి, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై నిర్లక్ష్యమా?

నిబంధనలు అమలవుతున్నాయా?

అధికారుల తనిఖీలు ఎక్కడ?

మన తొలివెలుగు ప్రత్యేక కథనం

మన తొలివెలుగు । భీమదేవరపల్లి రిపోర్టర్ । కదిరె స్వామి । అక్టోబర్ 18, 2026 : పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు అందాల్సిన కనీస సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంధనం కొనుగోలు చేసేందుకు వచ్చే వాహనదారులకు ఉచిత గాలి, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాల్సి ఉండగా, కొన్ని చోట్ల వాటి నిర్వహణపై ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను యాజమాన్యాలు ఎంతవరకు నిర్వర్తిస్తున్నాయి? వాటి అమలును పర్యవేక్షించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఉచిత గాలి కోసం వెళ్లినా ఇబ్బందులేనా?

వాహనాలకు గాలి నింపుకునే సౌకర్యం పెట్రోల్ బంకుల్లో కీలకమైనది. అయితే కొన్ని బంకుల్లో గాలి నింపే యంత్రాలు పనిచేయడం లేదని, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. ఉచితంగా అందాల్సిన సౌకర్యం సక్రమంగా అందకపోతే వాహనదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. యంత్రాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయించి, సౌకర్యం నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉంది.

తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత లేదా?

నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే పెట్రోల్ బంకుల్లో పరిశుభ్రమైన తాగునీటి సౌకర్యం ఎంతో అవసరం. ముఖ్యంగా దూరప్రాంతాలకు ప్రయాణించే వారు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలకు నీరు అందుబాటులో ఉండటం ముఖ్యం. కొన్ని చోట్ల తాగునీటి సౌకర్యం సరిగా లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటి సదుపాయం ఉన్నప్పటికీ పరిశుభ్రత, నిర్వహణపై శ్రద్ధ చూపకపోతే వినియోగదారులకు ఇబ్బందులు తప్పవు. ఈ అంశంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మరుగుదొడ్లు ఉన్నా వినియోగానికి అనుకూలమేనా?

ప్రయాణ సమయంలో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో



వెళ్లే కుటుంబాలకు మరుగుదొడ్లు అత్యవసర సౌకర్యం. అయితే బోర్డులు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా, నీటి సదుపాయం కల్పించేలా నిరంతరం నిర్వహించాలి. అపరిశుభ్రత కారణంగా వినియోగదారులు వాటిని ఉపయోగించలేని పరిస్థితి ఉంటే సౌకర్యం ఏర్పాటు చేసిన ఉద్దేశమే నెరవేరదు. మరుగుదొడ్ల నిర్వహణపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపడంతోపాటు, సంబంధిత సంస్థలు తనిఖీలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

అధికారుల తనిఖీలు ఎక్కడ?

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు అందాల్సిన సౌకర్యాలపై సంబంధిత చమురు మార్కెటింగ్ సంస్థలు, నియంత్రణ అధికారులు పర్యవేక్షణ చేపట్టాలి. గాలి యంత్రాల పనితీరు, తాగునీటి పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి, లోపాలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అయితే క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎన్ని జరుగుతున్నాయి? లోపాలపై ఎన్ని ఫిర్యాదులు అందాయి? వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించాల్సి ఉంది.

వినియోగదారులారా.. మీ హక్కులను ప్రశ్నించండి!

పెట్రోల్ బంకుల్లో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో లేకపోతే వినియోగదారులు బంకు యాజమాన్యాన్ని ప్రశ్నించవచ్చు. సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత చమురు సంస్థ ఫిర్యాదుల విభాగానికి సమాచారం అందించవచ్చు. ఫిర్యాదు చేసేటప్పుడు బంకు పేరు, చిరునామా, సమస్య వివరాలు, వీలైతే ఫొటోలు వంటి ఆధారాలను నమోదు చేసుకోవడం ఉపయోగకరం. ఫిర్యాదులపై సంబంధిత సంస్థలు స్పందించి, సమస్యలను



పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

అధికారులకు సూటి ప్రశ్నలు!

తెలంగాణలోని పెట్రోల్ బంకుల్లో ఉచిత గాలి సౌకర్యం సక్రమంగా అందుబాటులో ఉందా? తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై క్రమం తప్పకుండా తనిఖీలు జరుగుతున్నాయా? నిబంధనల ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులకు అధికారులు ఎలా స్పందిస్తున్నారు? లోపాలు గుర్తించిన బంకులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రజలకు సౌకర్యాలు కల్పించడం బాధ్యత కాదా?

పెట్రోల్ బంకులు ఇంధన విక్రయ కేంద్రాలుగానే కాకుండా, వినియోగదారులకు నిర్దేశించిన సౌకర్యాలను అందించే బాధ్యతాయుత సంస్థలుగా వ్యవహరించాలి. సౌకర్యాలు ఏర్పాటు చేయడం ఎంత ముఖ్యమో, వాటిని నిరంతరం వినియోగానికి అనుకూలంగా ఉంచడం కూడా అంతే ముఖ్యం. ప్రజల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయకుండా యాజమాన్యాలు స్పందించాలి. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, ఫిర్యాదులను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. వినియోగదారుల హక్కులు కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు



మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి । ముత్తయ్య । అక్టోబర్ 18, 2026 : శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జగన్మాత కనకదుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌఖ్యాలు వెల్లివిరియాలని, అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజల కష్టాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, చిగిరింత దయాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

బ్రాహ్మండ్లకుంట వద్ద ఆటపాటలతో సందడి చేసిన ఆడపడుచులు



మన తొలివెలుగు, భీమదేవరపల్లి ప్రతినిధి । కదిరె స్వామి । అక్టోబర్ 18, 2026 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో బ్రాహ్మండ్లకుంట వద్ద వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో పండుగ సందడిని నింపారు. సాయంత్రం సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకుని బ్రాహ్మండ్లకుంట వద్దకు చేరుకున్నారు. బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ సంప్రదాయ పాటలు పాడారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతూ పండుగ సంబరాలను జరుపుకున్నారు. మహిళల కోలాహలం, బతుకమ్మ పాటలతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని బ్రాహ్మండ్లకుంట పరిసరాలతో పాటు రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణలు ఏర్పాటు చేశారు. దీపాల వెలుగుల్లో రంగురంగుల బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలకు హాజరైన మహిళలు, గ్రామస్తులు ఆనందోత్సాహాలతో పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి మహిళలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొని పండుగను విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా సాగిన వేడుకల అనంతరం మహిళలు తమ బతుకమ్మలను సంప్రదాయబద్ధంగా బ్రాహ్మండ్లకుంటలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలి

శ్రీరామ్ కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ దంపతులు కెంచె లక్ష్మీనారాయణ, విజయకుమారి

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి । ముత్తయ్య । అక్టోబర్ 18, 2026: దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మాజీ కౌన్సిలర్ దంపతులు కెంచె లక్ష్మీనారాయణ, విజయకుమారి ఆకాంక్షించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని శ్రీరామ్ కాలనీలో యంగ్ ఇండియన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యంగ్ ఇండియన్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు కెంచె లక్ష్మీనారాయణ, విజయకుమారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కెంచె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అన్యాయాన్ని అంతం చేసి, ధర్మాన్ని కాపాడుతూ భక్తులను రక్షించే ఆదిశక్తి జగజ్జనని దుర్గామాత అని పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజల కష్టాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషం, శ్రేయస్సు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు.

దుర్గామాత నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు

భువనగిరి 8వ వార్డులో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



మన తొలి వెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి । జంగిటి రవీందర్ । అక్టోబర్ 18, 2026 : భువనగిరి పట్టణంలోని 8వ వార్డులో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఎట్టబోయిన సబితా గోపాల్ ఆహ్వానం మేరకు మాజీ బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్, పట్టణ కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

గాజులరామారం స్ఫూర్తి నిలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

రంగురంగుల పూల బతుకమ్మలతో మహిళల సందడి

ఆటపాటలతో మార్మోగిన వేడుకల ప్రాంగణం



మన తొలివెలుగు । కుత్బుల్లాపూర్ ప్రతినిధి । టీ. రమేష్ । అక్టోబర్ 18, 2026 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం స్ఫూర్తి నిలయంలో బతుకమ్మ పండుగ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి తెలంగాణ జానపద గీతాలను ఆలపిస్తూ ఆటపాటలతో సందడి చేశారు. ఉత్సాహంగా సాగిన బతుకమ్మ సంబరాలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడుకుంటూ, వాటి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య స్నేహభావాన్ని, ఆత్మీయతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



మన తొలివెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి । జంగిటి రవీందర్ । అక్టోబర్ 18, 2026 : తెలంగాణా సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక, రంగు రంగు పువ్వులను పేర్చి పువ్వులనే దేవతగా పూజించే బతుకమ్మ సంబారాల్లో భాగంగా మహిళా సోదరీమణులతో కలిసి ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలలో సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్ పాల్గొని బతుకమ్మ ఆట పాటలతో మహిళలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా తాజ్ పూర్ గ్రామ ప్రజలకు సద్దుల బతుకమ్మ ,మరియు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో మహాకాల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

డిజిటల్ మీటర్లతో ఖచ్చితమైన కొలతలు

నాణ్యమైన పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తాం



మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి । ముత్తయ్య । అక్టోబర్ 18, 2026 : వినియోగదారుల సమ్మకమే పెట్టుబడిగా, ఖచ్చితమైన కొలతలతో నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను సరఫరా చేస్తామని మహాకాల్ ఫిల్లింగ్ స్టేషన్ యజమానులు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో వివేకానంద విగ్రహం సమీపంలో శంషాబాద్ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన మహాకాల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారవేత్తలు పుంజాల రంజిత్ రావు, శ్రీమంతుల వీరస్వామి గౌడ్, శ్రీమంతుల శ్రీకాంత్ గౌడ్, శ్రీమంతుల మనీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంక్‌ను ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వ్యాపారవేత్తలు ఎడ్ల కృష్ణారెడ్డి, స్వామి గౌడ్, ఎమ్మెల్యే పద్మారావు కుమారుడు కిరణ్ గౌడ్, నిమ్మల నరేందర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిల్లింగ్ స్టేషన్ యజమానులు మాట్లాడుతూ.. తమ పెట్రోల్ బంక్‌లో డిజిటల్ మీటర్ల ద్వారా ఖచ్చితమైన కొలతలతో పెట్రోల్, డీజిల్ అందిస్తామని వెల్లడించారు. వినియోగదారులకు నాణ్యమైన ఇంధనాన్ని సరఫరా చేస్తూ వారి విశ్వాసాన్ని చూరగొని మంచి పేరు సంపాదించుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మామిడిపల్లి, జల్పల్లి గ్రామాల ప్రజలకు తమ ఫిల్లింగ్ స్టేషన్ అందుబాటులో ఉంటుందని, సమీప ప్రాంతాల వాహనదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కళ్లెం నరేష్, మాజీ చైర్మన్ గోపాల్ యాదవ్, నాయకులు యాతం పవన్ కుమార్ యాదవ్, సానం శ్రీనివాస్ గౌడ్, సుక్క శివకుమార్, ఈరంకి వేణు గౌడ్, పేరేమోని నరేష్ యాదవ్, లాల్ సతీష్ గౌడ్, ఆదిళ్ళ జంగయ్య, ఈరంకి విశ్వనాథ్ గౌడ్, షేక్ జహంగీర్, ఎండీ నయీమ్, గుర్జని గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా వేళ మద్యం సిండికేట్ల దందా

బెల్ట్ షాపులకు యథేచ్ఛగా సరఫరా?

బాటిల్‌పై రూ.20 నుంచి రూ.100 వరకు అదనపు వసూళ్ల ఆరోపణలు. !

ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణపై ప్రశ్నలు



మన తొలివెలుగు ।భీమదేవరపల్లి ప్రతినిధి । కదిరే స్వామి । అక్టోబర్ 18, 2026 : దసరా పండుగ వేళ ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం విక్రయాలపై అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ ఏ మేరకు ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

296 మద్యం దుకాణాలు.. సిండికేట్ల ఆధిపత్యం?

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 296 మద్యం దుకాణాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో కొన్ని దుకాణాల యజమానులు సమూహాలుగా ఏర్పడి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదు నుంచి పది లేదా అంతకంటే ఎక్కువ దుకాణాలు ఒకే సిండికేట్ తరహాలో వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వ్యవహారాల వల్ల వ్యాపారంలో పోటీ తగ్గి, ధరల విషయంలో వినియోగదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగితేనే వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

బెల్ట్ షాపులకు మద్యం ఎక్కడి నుంచి?

గ్రామాలు, పట్టణాల్లోని కొన్ని బెల్ట్ షాపులకు ఆటోలు, వ్యాన్ల ద్వారా మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణ దుకాణాల్లో అందుబాటులో లేని కొన్ని బ్రాండ్లు బెల్ట్ షాపుల్లో లభిస్తున్నాయనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల కొనుగోళ్లు, నిల్వలు, విక్రయాల రికార్డులను పరిశీలిస్తే సరఫరా మార్గాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏ దుకాణం నుంచి ఎంత మద్యం బయటకు వెళ్తోంది? అది ఎక్కడ విక్రయిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బాటిల్‌పై రూ.100 వరకు అదనపు వసూళ్లు?

కొన్ని ప్రాంతాల్లో బ్రాండ్‌ను బట్టి ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. పండుగ రద్దీని ఆసరాగా చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా అమ్మకాలు జరుగుతున్నాయా? కొనుగోలుదారులకు బిల్లులు ఇస్తున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలి. అధిక ధరల వసూళ్ల నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

షాపులు ముందే మూసివేత.. బెల్ట్ షాపుల్లో విక్రయాలా?

కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి ముందే మూసివేస్తున్నప్పటికీ, బెల్ట్ షాపుల్లో మద్యం లభిస్తోందనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో దుకాణాల నిర్వహణ సమయాలు, మద్యం నిల్వలు, రవాణా వివరాలపై తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

మామూళ్ల ఆరోపణలపై విచారణ ఏదీ?

అక్రమ మద్యం విక్రయాలపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. నెలవారీ మామూళ్ల కారణంగా తనిఖీలు బలహీనపడుతున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణ వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ శాఖ స్పందించాలి!

దసరా సందర్భంగా మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, బెల్ట్ షాపులకు అక్రమ సరఫరా జరుగుతోందన్న ఆరోపణలు, అధిక ధరల వసూళ్లు, దుకాణాల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సద్దుల బతుకమ్మ వేళా.. పేద మహిళలకు నిరాశేనా?

రెండేళ్లుగా అందని బతుకమ్మ చీరలు.. రెండు చీరల హామీ ఏమైంది?

కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో చూపేదెప్పుడు?.. చీరల కోసం మహిళల ఎదురుచూపులు



మన తొలివెలుగు । భీమదేవరపల్లి ప్రతినిధి । కదిరే స్వామి। అక్టోబర్ 18, 2026 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ముగుస్తున్న వేళ పేద మహిళలకు మాత్రం పండుగ కానుక అందక నిరాశే మిగులుతోంది. గతంలో ప్రతి ఏటా ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలు రెండేళ్లుగా పంపిణీ కాకపోవడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బతుకమ్మ చీరల పంపిణీపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యమైన చీరలు అందిస్తామని, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా రెండు చీరలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలవుతాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

2017లో ప్రారంభమైన పథకం

తెలంగాణలో బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని 2017లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. తెల్ల రేషన్ కార్డులు కలిగిన పేద కుటుంబాల్లోని 18 ఏళ్లు నిండిన మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా ఉచితంగా చీరలు అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. పండుగ వేళ మహిళలకు కానుక అందించడంతోపాటు, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా పేద మహిళలకు పండుగ కానుక అందడంతోపాటు, చీరల తయారీపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి లభించేది. ప్రభుత్వ ఆర్డర్లతో వస్త్ర పరిశ్రమకు కొంత మేర పనులు దక్కేవి. 2017 నుంచి 2023 వరకు కొనసాగిన ఈ పథకం మహిళల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిలిచిన పంపిణీ!

2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల పంపిణీ నిలిచిపోయింది. 2024, 2025 సంవత్సరాల్లోనూ చీరలు అందకపోవడంతో మహిళలు నిరాశకు గురయ్యారు. 2026 సద్దుల బతుకమ్మ నాటికి కూడా పంపిణీపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వాలు మారినా ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆశించిన మహిళలకు ఎదురుచూపులే మిగిలాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. బతుకమ్మ చీరల పథకాన్ని కొనసాగిస్తారా? కొనసాగిస్తే ఎప్పటి నుంచి పంపిణీ చేపడతారు? అర్హులైన మహిళలను ఎలా గుర్తిస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

రెండు నాణ్యమైన చీరల హామీ ఏమైంది?

గతంలో పంపిణీ చేసిన బతుకమ్మ చీరల నాణ్యతపై విమర్శలు రావడంతో, నాణ్యమైన చీరలు అందించాలనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు మెరుగైన నాణ్యతతో చీరలు అందిస్తామని, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా రెండు చీరలు ఇస్తామని ఇచ్చిన హామీలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. హామీలతో మహిళల్లో ఆశలు చిగురించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రారంభం కాకపోవడంతో ఆ ఆశలు నిరాశగా మారుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. చీరల తయారీకి ఆర్డర్లు, సరఫరా, పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వెల్లడించాలని కోరుతున్నారు.

అధికార యంత్రాంగం వద్ద స్పష్టత ఉందా?

బతుకమ్మ చీరల పంపిణీకి సంబంధించి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయా? చీరల తయారీకి ఆర్డర్లు ఇచ్చారా? ఎన్ని చీరలు సిద్ధం చేశారు? పంపిణీ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది? అర్హులైన మహిళలను గుర్తించే విధానం ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. జిల్లా, మండల స్థాయిలో మహిళలకు పంపిణీపై సమాచారం అందకపోవడం గందరగోళానికి కారణమవుతోంది. సంబంధిత శాఖల అధికారులు వాస్తవ పరిస్థితిని వెల్లడించి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు తెలియజేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

చీర విలువ కంటే గుర్తింపే ముఖ్యం!

బతుకమ్మ చీరల పంపిణీ అనేది కేవలం వస్త్రాల పంపిణీ మాత్రమే కాదని, పండుగ వేళ ప్రభుత్వం తమను గుర్తించిందనే భావన మహిళలకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ప్రభుత్వం అందించిన చీరలను పండుగ సందర్భంగా ధరించేవారమని, ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా పోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. చీర ధర ఎంత అన్నది కాదని, పండుగ సమయంలో ప్రభుత్వం అందించే కానుక తమకు గుర్తింపు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని మహిళలు పేర్కొంటున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, నాణ్యమైన చీరలను అందించాలని కోరుతున్నారు.

నేతన్నలకు తప్పని ఎదురుచూపులు

బతుకమ్మ చీరల పంపిణీ నిలిచిపోవడం మహిళలతోపాటు వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన కార్మికులపైనా ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా చీరల తయారీకి పని లభిస్తే నేతన్నలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కూడా ప్రయోజనం చేకూరుతుంది.

ప్రభుత్వం చీరల కొనుగోలు, పంపిణీ కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే ఒకవైపు మహిళలకు పండుగ కానుక అందడంతోపాటు, మరోవైపు వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. మహిళా సంక్షేమం, నేతన్నల ఉపాధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించేదెప్పుడు?

సద్దుల బతుకమ్మ వేళ కూడా చీరలు అందకపోవడంతో పేద మహిళల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వడంతోపాటు, చీరల పంపిణీకి సంబంధించిన కార్యాచరణను ప్రకటించాలని మహిళలు కోరుతున్నారు. వీలైతే దీపావళి నాటికైనా చీరలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, ఈలోపు పంపిణీ జరుగుతుందా లేదా అన్న దానిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మహిళలకు ఏటా రెండు చీరలు ఇస్తామన్న హామీ ఎప్పుడు అమలవుతుంది? బతుకమ్మ చీరల పథకం తిరిగి ప్రారంభమవుతుందా? నేతన్నలకు మళ్లీ ప్రభుత్వ ఆర్డర్లు అందుతాయా? అనే ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. పండుగలు వస్తున్నా పేద మహిళలకు అందాల్సిన కానుక అందకపోవడంపై నెలకొన్న అసంతృప్తికి ప్రభుత్వం ఎప్పుడు తెరదించుతుందో వేచి చూడాలి.

సెక్షన్ 22-ం ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సాఫ్ట్‌వేర్ మోక్షం!


హైదరాబాద్ : తెలంగాణలో సరైన అనుమతులు, అప్రూవ్డ్ లేఅవుట్లు ఉన్నప్పటికీ, సెక్షన్ 22-ం చట్టపరమైన అంక్షల కారణంగా సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్లు కాకుండా ఆగిపోయిన వేలాది ఆస్తుల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించనుంది. చట్టబద్ధమైన ప్లాట్లు ఉన్నప్పటికీ సాంకేతిక, రికార్డు లోపాల వల్ల క్రయవిక్రయాలు జరగక ఇబ్బంది పడుతున్న సామాన్యుల కష్టాలను తొలగించేందుకు రెవెన్యూ శాఖ రంగంలోకి దిగింది. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే దిశగా రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేకంగా ఒక సరికొత్త సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను సిద్ధం చేస్తోంది.గతంలో ప్రభుత్వ భూములు, వివాదాస్పద స్థలాలు లేదా ఇనామ్ భూముల ముసుగులో చాలా వరకు చట్టబద్ధమైన లేఅవుట్లు కూడా సెక్షన్ 22-ం జాబితాలో చేరిపోయాయి. దీనివల్ల పక్కా ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్రజలు, చిన్న రియల్టర్లు తమ ఆస్తులను అమ్ముకోలేక, బ్యాంకుల నుంచి గృహ రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం దొరకని ఈ దీర్ఘకాలిక సమస్యను గుర్తించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అర్హమైన ఆస్తులను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి పకడ్బందీ విధివిధానాలను రూపొందించింది.ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించే ఉద్దేశంతోనే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఒక అత్యాధునిక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా ఎంపిక చేసిన ఆస్తులకు సంబంధించిన అసలైన డాక్యుమెంట్లు, ఆమోదించిన లేఅవుట్ పత్రాలు, రెవెన్యూ రికార్డులను ఈ కొత్త పోర్టల్‌లో డిజిటలైజ్ చేసి పరిశీలిస్తారు. అన్ని అర్హతలు సక్రమంగా ఉన్నట్లు తేలితే, ఆటోమేటిక్‌గా ఆ ప్లాట్లను 22-ం నిషిద్ధ జాబితా నుంచి తొలగించేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేశారు. దీనివల్ల అవినీతికి ఆస్కారం లేకుండా, మానవ ప్రమేయం లేకుండా పారదర్శకంగా క్లియరెన్స్ లభిస్తుంది.ఈ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్ అందుబాటులోకి వస్తే, రాష్ట్రవ్యాప్తంగా చిక్కుల్లో పడి ఉన్న వేల ఎకరాల ఆస్తుల క్రయవిక్రయాలకు మార్గం సుగమమవుతుంది. రియల్ ఎస్టేట్ రంగంలో ఊచకోత కోస్తున్న నిరుత్సాహం తొలగిపోయి, లావాదేవీలు మళ్లీ పుంజుకుంటాయని నిపుణులు భావిస్తున్నారు. తద్వారా వేలాది మంది గృహ కొనుగోలుదారులకు చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు దక్కడంతో పాటు ప్రభుత్వానికి కూడా రిజిస్ట్రేషన్ల రూపంలో భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.


దసరా పండుగ సందర్భంగా ఓపీ సేవల

వరంగల్ : ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. ఈ క్రమంలో వరంగల్?లోని సూపర్? స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి, దసరా పండుగ సందర్భంగా ఓపీ సేవలను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. వరంగల్?లోని ఎంజీఎం ఆస్పత్రి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం త్వరగా సూపర్? స్పెషాలిటీ ఆస్పత్రి భవనంలో వైద్య విభాగాలను తరలించి, సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇన్?ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 24 అంతస్తులతో నిర్మితమవుతున్న ఈ ఆస్పత్రిలో ముందుగా ఓపీ సేవలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ఏడాది దసరా నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయి. నవంబర్ చివరి నాటికి లేదా డిసెంబర్?లో పూర్తిగా వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గురువారం, మంత్రి సీతక్క మరియు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఓపీ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు మరియు జాగ్రత్తలపై ఆమె కొన్ని సూచనలు చేశారు.మాజీ బీఆర్?ఎస్? ప్రభుత్వం కేవలం జీవోలు ఇచ్చి నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. నిర్మాణాలను మొండి గోడల దశలో విడిచిపెట్టారని ఆమె పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, ఆటంకాలు లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వెల్లడించారు. మంత్రుల వెంట ఎంపీ బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్? రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ ?రెడ్డి, రేవూరి ప్రకాశ్? రెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్? సారయ్య, కుడా చైర్మన్? సుధారాణి, కలెక్టర్?లు సత్య శారద, చాహత్?భాజ్?పాయ్? తదితరులు ఉన్నారు.వరంగల్? సెంట్రల్? జైలు స్థలంలో 56 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,150 కోట్ల వ్యయంతో 2021లో ఈ సూపర్? స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఆస్పత్రిలో దశల వారీగా మొత్తం 2,208 పడకల సామర్థ్యంతో వైద్య సేవలు అందించనున్నారు. అన్ని విభాగాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్?, ఆదిలాబాద్?, కరీంనగర్? జిల్లాలతో పాటు ఛత్తీస్?గఢ్?, మహారాష్ట్రకు చెందిన పేద ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించబడతాయి. ఈ సూపర్? స్పెషాలిటీ భవనంలోని 9 అంతస్తులను వైద్య సేవలకు వినియోగించేందుకు ప్రణాళిక వేసారు. అయితే ప్రస్తుతం కేవలం ఆరు అంతస్తులలోనే పనులు పూర్తయ్యాయి. మిగతా అంతస్తుల్లో సివిల్? పనులు మిగిలి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో తరచూ ఏదో ఒక ఘటన జరుగుతోంది. ఈ కారణంగా, త్వరగా ఇక్కడి వైద్య సేవలను కొత్త భవనంలోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దసరా రోజున రెండు అంతస్తుల్లో ముందుగా 22 విభాగాలకు సంబంధించిన ఓపీ సేవలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సూపర్? స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తిగా అందుబాటులోకి వస్తే, మొత్తం 37 విభాగాలకు సంబంధించిన వైద్య సేవలను అందించనున్నారు. సంతాన లేమి, అవయవ దానం, అవయవ మార్పిడి వంటి సమస్యలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

దసరాకు హైడ్రా పోలీస్ స్టేషన్

హైదరాబాద్ : హైడ్రా పరిధిలోని సరస్సులు, చెరువులు, రోడ్లు, పార్కులు, లేఅవుట్‌లలోని ఖాళీ స్థలాలను ఆక్రమించిన వారిపై క్రిమినల్? కేసులు నమోదు చేయడానికి హైడ్రా పోలీస్? స్టేషన్? సిద్ధమవుతోంది. ఇటీవల అమల్లోకి వచ్చిన క్యూర్? చట్టంతో, హైడ్రా కోసం ప్రత్యేక పోలీస్? స్టేషన్? ఏర్పాటు చేయడం, అధికారాలపై స్పష్టత ఇవ్వడం జరిగింది. అయితే, ఈ చట్టాన్ని ఎలా అమలు చేయాలో సంబంధించి మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నాయి. దసరా పండుగకు ముందు లేదా పండుగ తర్వాత ఈ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, హైడ్రా, మూడు మున్సిపల్? కార్పొరేషన్ల అధికారుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో హైడ్రా పరిధి, క్యూర్? చట్టం కల్పించిన అధికారాలు, వాటిని ఎలా అమలు చేయాలో వివరిస్తారు. సెక్షన్? 241(3) ప్రకారం, క్యూర్? చట్టంలోని 28వ అధ్యాయం, సెక్షన్? 241(3) హైడ్రా స్పష్టం చేస్తోంది. ఈ సెక్షన్ల కింద క్రిమినల్? కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వ ఉద్యోగి విధులను అడ్డుకోవడం, ఉద్యోగిపై దాడి చేయడం, జలాశయాలను కలుషితం చేయడం వంటి చర్యలకు ఈ సెక్షన్లు వర్తిస్తాయి. అయితే, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా లేదా కమిషనర్? సిఫార్సుతో కేసులు నమోదు చేయాలా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంది. ఈ కేసులపై నాంపల్లిలోని తొమ్మిది మెట్రోపాలిటన్? మెజిస్ట్రేట్? కోర్టులో విచారణ జరగనుంది. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా చర్యలు తీసుకుంటుందని కమిషనర్? ఏవీ.రంగనాథ్? తెలిపారు. కప్రా చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని, రూ.35 కోట్ల ఖర్చుతో చేపట్టిన ఈ పనులు 450 రకాల వలస పక్షులకు ఆవాసంగా మారాయని హైడ్రా బుధవారం మీడియాకు వెల్లడించింది. హైడ్రా ఇప్పటికే వందల ఎకరాల భూములను, పలు చెరువులు, పార్కులు, నాలాలు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించిందని కమిషనర్? రంగనాథ్? వివరించారు. వేర్వేరు పోలీస్ స్టేషన్‌లో 50కి పైగా కేసులు విచారణలో ఉన్నాయని ఆయన తెలిపారు. హైడ్రా పోలీస్ స్టేషన్?అందుబాటులోకి వస్తే, ఆయా కేసులన్నీ హైడ్రాకు బదిలీ అవుతాయని గతంలో వివరించారు. కొత్త కేసులు వేగంగా నమోదవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు. సమస్య మూలాల్లోకి వెళ్లి చెరువుల ఆక్రమణలను అడ్డుకోవడం, నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్న అధికారులను, సిబ్బందిని, ఆక్రమణదారులను పక్కా ఆధారాలతో జైలుకు పంపడమే లక్ష్యమని రంగనాథ్ తెలిపారు.





అమెరికాలో హిస్టారికల్ వరల్డ్ ప్రీమియర్

దేశమంతా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. నితీశ్ తివారీ రూపొందిస్తున్న ఈ వెండితెర ఇతిహాసంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం అమెరికా లాస్ ఎంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరుగనున్నది. ఆహ్వానం ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్ ప్రముఖుల, దర్శకులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, పలువురు ప్రపంచ సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్ వేడుకలకు వేదికగా నిలిచిన అకాడమీ మ్యూజియంలో 'రామాయణ' ప్రీమియర్ జరుగనుండటం భారతీయ సినీచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మేకర్స్ చెబుతున్నారు. 945మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌లో 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా స్క్రీనింగ్ జరుగనున్నది. ఇక ఈ ఫ్రాంచైజీకి చెందిన రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రానున్న విషయం తెలిసిందే.

రివార్డులతోపాటు అవార్డులూ సాధించే సినిమా



నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రేజీకల్యాణం" అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తామని ప్రేక్షకులు రుజువు చేశారని, భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడినీ కలిపే సినిమా ఇదని, రివార్డ్స్‌తోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని అగ్రనటుడు నరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

హానెస్ట్‌గా తీసిన గ్లోబల్ సినిమా 'కల్ట్'



'మొదటి అయిదు నిమిషాలకే ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇదో గ్లోబల్ కంటెంట్. అందుకే ఈ సినిమాను జపనీస్,స్పానిష్ భాషల్లో కూడా డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా. రెండు గంటల 20 నిమిషాల పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. యాక్షన్ కంటే ఆడియన్స్ డ్రామాకు కనెక్టవుతారు. నేను ఎక్స్‌పెరిమెంట్ చేసిన ప్రతిసారీ ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. ఇందులో ఎలాంటి ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్ ఉండవు. చాలా హానెస్ట్‌గా ఈసినిమా చేశాం. ఇందులో 150మంది ప్రొఫెషనల్ యాక్టర్స్ ఉన్నారు. వారంతా కేవలం నా కోసం ఈ సినిమాలో భాగమయ్యారు. నటుడిగానే కాక, దర్శకునిగా కూడా నాకు సంతృప్తిని ఇచ్చిన సినిమా 'కల్ట్" అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నిర్మాత సందీప్ కాకరాల, యాక్టర్ ఈజీ, అనిరుధ్, కార్తికేయ, తారక్ పొన్నప్ప కూడా మాట్లాడారు. గోవాలోని ఒక నిర్మానుష్య ఐలాండ్ ఎస్టేట్‌లో 300మందికి పైగా చిక్కుకుపోవడంతో ట్రైలర్ మొదలైంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ట్రైలర్ సాగింది. ట్రైలర్‌లో విశ్వక్ పాత్ర విభిన్న కోణాల్లో కనిపించింది. వాస్తవంగా జరిగిన భయానక సంఘటనల స్ఫూర్తితో రూపొందిన తొలి ఇండియన్ స్లాషర్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు.



ఈనెల 30న జ్యోతి పూర్వాజ్ "కిల్లర్" రిలీజ్

జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్ ప్రధాన పాత్రలు చేసిన సై ఫై థ్రిల్లర్ సినిమా "కిల్లర్". మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఏ నిర్మిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహించాడు. ఈ నెల 30న థియేటర్లలో మూవీ రిలీజ్ కానుంది. ఈ నెల 21న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఓవర్సీస్‌లోనూ "కిల్లర్" మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఓఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ "కిల్లర్" సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్, రష్యా వంటి దేశాల్లో విడుదల చేయనుంది.

షూటింగ్ పూర్తి



మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'సంబరాల ఏటి గట్టు' రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన 'బిహైండ్ ది సీన్స్' వీడియోలో ఈ సినిమా కోసం వేసిన భారీ సెట్స్‌ని, కొన్ని రా యాక్షన్ సన్నివేశాలతోపాటు టీమ్ మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ని కూడా చూపించారు. పదికి పైగా భారీ షెడ్యూల్స్‌తో 160 రోజులకు పైగా షూటింగ్ జరిపామని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీగా 'సంబరాల ఏటిగట్టు' నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిన సందర్భంగా యూనిట్ మొత్తానికీ కృతజ్ఞతలు తెలుపుతూ, టీమ్‌తో కలిసి హీరో సాయిదుర్గతేజ్ సంబరాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు ధనంజయ, ఐశ్వర్యలక్ష్మి, జగపతిబాబు, నరేష్ వీకే, సాయికుమార్, శ్రీకాంత్ మేక, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17067